

సెర్ప్ ఉద్యోగులకు సంబరం
డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పనిచేసే గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు ప్రభుత్వం జీతాలు పెంచింది. - 8లో



వరుణ్ మారుతీతో ఐటీఐ ఒప్పందం
జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐ- వరుణ్ మారుతీ మధ్య డీజిల్ మెకానిక్ ట్రైనీల శిక్షణకు సంబంధించిన ఒప్పందం కుదిరింది. - 8లో



అన్ని రకాలుగా సహకారం
ఎఫ్‌పీఓల ద్వారా రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి వ్యవసాయాన్ని లాభదాయకంగా చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

గోటి తలంబ్రాల సేద్యానికి శ్రీకారం



గోటి తలంబ్రాలకు ఉభాలు వేసిన పొలంవద్ద పూజలు చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ఏటా ప్రభుత్వ లాంఛనాలతో జరుగుతున్న శ్రీరామ నవమి ఉత్సవాలకు గోటితో సిద్ధం చేసిన పవిత్ర తలంబ్రాలను వినియోగిస్తున్న సంగతి తెలిసిందే. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి మండలంలో జగపతినగరం గ్రామానికి చెందిన పలువురు భక్తులు ఏటా నవమి కల్యాణానికి పవిత్ర తలంబ్రాలను పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తలంబ్రాలను సిద్ధం చేసేందుకు అక్కడి భక్తులు మంగళవారం శ్రీకారం చుట్టారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని వరి సేద్యానికి భక్తి శ్రద్ధలతో ఉభాలు జరిపారు. వరి పంట కోతకోశాక ముక్కోటి ఏకాదశి రోజు నుంచి గోటి తలంబ్రాలను సిద్ధంచేసి రామతీర్థం దేవస్థానానికి పంపిస్తామని శ్రీరామ భక్తుడు శివన్నారాయణ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం
సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని భామిని, మెళియాపుట్టిలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ (ఈఎంఆర్‌ఎస్) పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల తాత్కాలిక భర్తీకి విశ్రాంత ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ ఇంగ్లిష్, గణితం, ఫిజిక్స్, హిస్టరీ, ఎకనామిక్స్, బయాలజీ, పొలిటికల్ సైన్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మొత్తం 16 పోస్టులకు వచ్చేనెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రైతుల వివరాల నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: రైతులకు ఖరీఫ్ సీజన్ పెట్టుబడి సాయం అందించే పీఎం కిసాన్ పథకానికి లబ్ధిదారుల ఖాతా నంబర్‌కు ఆధార్ నమోదు ప్రక్రియ పూర్తిచేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గృహ నిర్మాణాలు, ఇ-క్రాప్ నమోదు, పీఎం కిసాన్ పథకంవర్తింపు, జాతీయ ఉపాధి హామీ పథకం, ప్రాధాన్యతా భవనాలు, రీ సర్వే తదితర అంశాలపై మండల అధికారులతో మంగళవారం సమీక్షించారు. రైతు భూమి వివరాలు వెబ్‌ల్యాండ్‌లో నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బలిజిపేట గ్రామంలో 1240 మంది రైతుల వివరాలు ప్రత్యేక యాప్‌లో ఆధార్‌తో అనుసంధానం చేయాలన్నారు. గృహనిర్మాణాలు, ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల పనులు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, డీఆర్వో జె.వెంకటరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల శిక్షణ తరగతులు ప్రారంభం
- జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్

విజయనగరం రూరల్: పంచాయతీ కార్యదర్శుల్లో పరిపాలన సామర్థ్యాలు పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శుల రిఫ్రెషర్ శిక్షణ తరగతులను జిల్లా కేంద్రంలోని టీటీడీసీ ప్రాంగణం, యూత్ హాస్టల్‌లో జెడ్పీ సీఈవో రాజ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం, గ్రామ పంచాయతీ పరిపాలన వ్యవహారాలు, జిల్లా ఆఫీస్ మాన్యువల్, సీసీఏరూల్స్, నోటింగ్ డ్రాఫ్టింగ్ నైపుణ్యాలు, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్, స్వమిత్వ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. లేఅవుట్‌కి అనుమతి ఇవ్వటం, స్వమిత్వ భూ సర్వేపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. విజయనగరం జిల్లాలోని 27 మండలాల్లోని 150 మంది పంచాయతీ కార్యదర్శులకు, పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లోని 98 మంది పంచాయతీ కార్యదర్శులకు తొలివిడతలో శిక్షణ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల శిక్షణ తరగతుల ఇన్‌చార్జిలు ఎ.దేముడు, జయరామలక్ష్మి పాల్గొన్నారు.

● క్రీడా సందడి



హాకీ క్రీడా మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో క్రీడాదినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆటల పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులను, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారులను సంత్కరించారు. టాగ్ ఆఫ్‌వార్‌లో తలపడుతున్న మక్కువ మండలం కాశీపట్నం కేజీబీవీ బాలికలను చిత్రంలో చూడొచ్చు. - మక్కువ



● తెలుగు వెలుగు



ఉమ్మడి విజయనగరం జిల్లాలో తెలుగుభాషా దినోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు తెలుగు తల్లి, కవుల వేషధారణలు, కోలాటాలతో అలరించారు. తెలుగుభాషపై కవిసమ్మేళనాలు నిర్వహించారు. వ్యవహారిక భాషోద్యమ నాయకుడు, సంఘ సంస్కర్త గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాషోద్ధరణకు గిడుగు చేసిన కృషిని తెలుగు పండితులు వివరించారు. - భామిని/సీతంపేట

సీతంపేట బాలికల గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థినుల అక్షర ఆకారం

అర్హులందరికీ పింఛన్లు



ఈ ఏడాది జనవరిలో కొత్త పింఛన్లు తీసుకుని ఆనందం వ్యక్తం చేస్తున్న పింఛన్‌దారులు (ఫైల్)

- జిల్లాలో కొనసాగుతున్న పింఛన్ దరఖాస్తుల పరిశీలన
- ఇప్పటివరకు గుర్తించిన కొత్త పింఛన్ లబ్ధిదారులు 14,895 మంది
- తుది జాబితాను సిద్ధం చేస్తున్న యంత్రాంగం
- ప్రస్తుతం ఇస్తున్న పింఛన్లు: 1,38,885
- వీరికి ప్రతినెలా అందజేస్తున్న పింఛన్ మొత్తం: రూ.38.11 కోట్లు
- అదనంగా చెల్లించాల్సిన మొత్తం: రూ.4.09 కోట్లు

వీరఘట్టం: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచి అవ్వాతాతలకు పింఛన్ కష్టాలు గట్టెక్కాయి. ఎటువంటి సిఫార్సులు లేకుండా.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ ఇచ్చే సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. అర్హతే కొలమానంగా ప్రతీ ఆరునెలలకోసారి పింఛన్లు మంజూరు చేస్తున్నారు. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా 15 మండలాల నుంచి పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను అధికారుల బృందం పరిశీలిస్తోంది. అర్హులను గుర్తిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 15,015 మంది కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోగా వీటిలో 14,895 మందిని ఇప్పటికే అర్హులుగా గుర్తించారు. నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. కొద్దిరోజుల్లో వీరందరికీ కొత్త పింఛన్లు మంజూరవుతాయని అధికారులు చెబుతున్నారు.

ఇచ్చిన మాట ప్రకారం..
అవ్వాతాతలకు ప్రస్తుతం ఇస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుకను దశల వారీగా పెంచుకుంటూ రూ.3 వేలు చేస్తానంటూ 2019 సార్వత్రిక ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు రూ.2 వేలు ఉన్న పింఛన్‌ను ఏటా రూ.250 చొప్పున పెంచుతూ ప్రస్తుతం రూ.2,750కు చేర్చారు. దివ్యాంగులకు రూ.3 వేలు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి రూ.5 వేలు పింఛన్ ఇస్తూ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు.

మన్యం జిల్లాలో..
పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ ఏడాది జనవరిలో 6,573 మందికి కొత్తగా పింఛన్ మంజూరు చేయడంతో ప్రస్తుతం వివిధ కేటగిరిల్లోని మొత్తం పింఛన్‌దారులు 1,38,885 మంది ఉన్నారు. ప్రస్తుతం వీరందరికీ ప్రతినెలా రూ.38,11,82,500లను ప్రభుత్వం అందిస్తోంది. తాజాగా కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 14,895 మందిని అర్హులుగా అధికారులు గుర్తించారు.అంటే వీరికి అదనంగా మరో రూ.4.09 కోట్లను కేటాయించనుంది. వచ్చే నెలలో కొత్త పింఛన్లు ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

నాడు: అన్ని అర్హతలూ ఉన్నా పింఛన్ మంజూరుచేయాలంటే ముందు ఆ నియోజకవర్గ రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకోవాలి. జన్మభూమి కమిటీ సభ్యుల కాళ్ల చుట్టూ తిరగాలి. ఎంతోకొంత ముట్టజెప్పాలి. అప్పటికి కూడా ఎప్పుడు మంజూరవుతుందో తెలియదు. పింఛన్ మంజూరైతే ఆ డబ్బుల కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద పనులు మానుకుని రోజుల తరబడి పడిగాపులు కాయాలి. ఎంతోకొంత ముట్టజెబితే తప్ప చేతికి పింఛన్ అందని పరిస్థితి.

నేడు: పింఛన్ పొందేందుకు అర్హులై ఉంటే చాలు. వలంటీరు మీ ఇంటికి వస్తారు. పింఛన్ దరఖాస్తును పూరించి, మీతో సంతకం చేయించి సచివాలయంలో అందజేస్తారు. ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వకుండా.. ఎలాంటి వ్యయప్రయాసలు లేకుండా.. ఎవరి చుట్టూ తిరగకుండా.. దరఖాస్తు చేసిన రోజులు, నెలల వ్యవధిలో పింఛన్ అర్హత పత్రం మీ ఇంటికే చేరుతుంది. అక్కడి నుంచి ప్రతినెలా ఒకటో తేదీన మీ ఇంటివద్దకు వచ్చి వలంటీరు పింఛన్ డబ్బులు అందజేస్తారు. ఇదీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లుగా సాగుతున్న సంక్షేమ పాలన.

పింఛన్ దరఖాస్తులు పరిశీలిస్తున్నాం



వైఎస్సార్ పింఛన్ కానుక కోసం జిల్లా వ్యాప్తంగా 15,015 దరఖాస్తులు రాగా వీటిలో 14,895 దరఖాస్తులు పరిశీలించి అర్హులుగా గుర్తించాం. మిగిలిన 120 మంది అందుబాటులో లేకపోవడంతో పరిశీలించలేదు. ఈ నివేదికను ప్రభుత్వానికి పంపిస్తాం. ఇంకా పింఛన్‌దారులు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లాలో ప్రతినెలా రూ.38.11 కోట్లను పింఛన్‌దారులకు అందజేస్తున్నాం.

- పి.కిరణ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ పార్వతీపురం మన్యం జిల్లా

సాలూరు-విశాఖ రైలుకు గ్రీన్‌సిగ్నల్

- డిప్యూటీ సీఎం రాజన్నదొర, అరకు ఎంపీ గొడ్డేటిమాధవి కృషి ఫలించింది
- ఆనందంలో ప్రయాణికులు



సాలూరు రైల్వే స్టేషన్

సాలూరు: సాలూరు-విశాఖపట్నం పాసింజర్ రైలు నడిపేందుకు రైల్వే ఉన్నతాధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. గతంలో సాలూరు నుంచి బొబ్బిలికు రైలు బస్సు నడిచేది. ఇటీవల అది నిలిచిపోయింది. సాలూరు నుంచి బొబ్బిలి మీదుగా విశాఖపట్నంకు పాసింజర్ రైలు నడపాలని పలుమార్లు ప్రయాణికులు రైల్వే అధికారులకు విజ్ఞప్తిచేశారు. ఇదే విషయాన్ని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కేంద్ర ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సాలూరు-విశాఖపట్నం పాసింజర్ రైలు నడిపేందుకు రైల్వే అధికారులు పచ్చజెండా ఊపారు. సాలూరు నుంచి బొబ్బిలి, విజయనగరం మీదుగా విశాఖపట్నం రైలు నడవనుందని, రైలు స్టాప్‌ల వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని సాలూరు స్టేషన్ సూపరింటెండెంట్ సుధాకర్ తెలిపారు. పాసింజర్ రైలు అందుబాటులోకి వస్తే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారుల రాకపోకలకు ప్రయోజనకరంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజాప్రతినిధుల కృషిని ప్రయాణికులు అభినందిస్తున్నారు.

రైలు రాకపోకలు ఇలా..
- ఉదయం 4 గంటలకు సాలూరు నుంచి రైలు బయలుదేరుతుంది. 4.50కు బొబ్బిలి, 5.10కు బొబ్బిలి నుంచి బయల్దేరి 6.05కు విజయనగరానికి చేరుతుంది.
- ఉదయం 6.10 గంటలకు విజయనగరం నుంచి బయల్దేరి 7.30కు విశాఖపట్నం చేరుతుంది.
- విశాఖపట్నంలో తిరిగి సాయంత్రం 6.30కు రైలు ప్రారంభమవుతుంది.
- రాత్రి 7.45కు విజయనగరం చేరుకుని 7.50కు అక్కడి నుంచి బయల్దేరుతుంది.
- 8.50కు బొబ్బిలి చేరుకుని 9.10 గంటలకు బయలుదేరి రాత్రి 10 గంటలకు సాలూరుకు చేరుకుంటుంది.

నిబంధనల మేరకు ఓటర్ల తొలగింపు



ఓటర్ల తొలగింపు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురంటౌన్: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటర్ల తొలగింపు ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. ఓటరు పునఃశ్చరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఇంటింటికీ ఓటరు నమోదు ప్రక్రియను పట్టణంలోని 32, 38 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల జాబితాను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మృతి చెందిన ఓటర్లు, శాశ్వత వలసలు, డబుల్ ఎంట్రీ ఓటర్ల తొలగింపు విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఓటర్ల తొలగింపు ప్రక్రియలో ఫామ్-13 నోటీస్ జారీ చేయాలని, శాశ్వత వలసల ఓటర్లు, మరణించిన ఓటర్ల పంచనామాను బూత్‌స్థాయి అధికారులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. మరణించిన ఓటర్ల ఆధార్ కార్డును నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిబంధనలకు లోబడి పారదర్శకంగా ఓటరు పునఃశ్చరణ కార్యక్రమం చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ స్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.శివన్నారాయణ, ఉప తహసీల్దార్ వెంకటరమణ, పంచాయతీరాజ్ పర్యవేక్షకులు చంద్రమౌళి, రెవెన్యూ అధికారి రామకృష్ణ, బూత్‌స్థాయి అధికారులు సంధ్యా, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అచ్చతెలుగు చిచ్చరపిడుగు 'గిడుగు'

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరావు



గిడుగు చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న డీఆర్వో వెంకటరావు, తదితరులు

పార్వతీపురం: గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు భాషను ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చిన మహనీయుడు, అచ్చతెలుగు చిచ్చర పిడుగు 'గిడుగు' అని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ గిడుగు వీర్రాజు, వెంగమాంబ దంపతులకు 1863 ఆగస్టు 29న జన్మించిన రామమూర్తి భాషా శాస్త్రవేత్త, పరిశోధకుడు, గ్రంథపరిష్కర్త, శాసనపరిష్కర్త, పత్రికా రచయిత, ప్రజాస్వామ్యవాది, మానవతావాదిగా గిడుగు పేరు పొందారన్నారు. కేవలం భాషాఉద్యమానికే పరిమితం కాకుండా, పర్లాకిమిడి దగ్గర కొండ ప్రాంతంలో నివసించే 'సవరల' కోసం తను సవరభాష నేర్చుకొని, వాచకములు రాసి, నిఘంటువును తయారు చేసి, తన సొంత ధనంతో బడులు పెట్టించి ముప్పై సంవత్సరాలు వారికి విద్యాబోధన చేశారని ఆయన వివరించారు. గిడుగు భాషా ఉద్యమానికి గొడుగు పట్టిన గొప్పవ్యక్తి గురజాడ అని, వీరి బంధం అపూర్వం, అనిర్వచనీయమన్నారు. మాతృభాష మానవ మనుగడకు కీలకమన్నారు. అమ్మ భాషతో ఒక విషయంపై స్పష్టమైన పట్టుసాధించవచ్చని, ఇతర భాషలు నేర్చుకునేందుకు చక్కని బాటలు వేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, టీపీఎంయూ ఏపీడీ వై.సత్యంనాయుడు, జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్‌శాఖ అధికారి ఎల్.అశోక్‌కుమార్, జిల్లా కలెక్టర్ కార్యాలయ పాలనాధికారి ఆర్.ఉమామహేశ్వరరావు, పర్యవేక్షకులు శ్రీరామమూర్తి, రవి పాల్గొన్నారు.

పార్వతీపురం డీఎంహెచ్‌ఓపై విచారణ

విజయనగరం ఫోర్ట్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పార్వతీపురం డీఎంహెచ్‌ఓ డాక్టర్ జగన్నాథరావును మంగళవారం విచారణ జరిపారు. ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టించారని ఏపీ గిరిజన ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జలుమూరు మణికుమార్, కార్యవర్గ సభ్యులు సరసన బిల్లీ, మణికంఠలు రాష్ట్ర కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో విచారణ అధికారి డాక్టర్ దేవసాగర్ విజయనగరం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జగన్నాథరావు, జిల్లా మలేరియా నిర్మూలన అధికారిని విచారణ చేశారు. లాజిస్టిక్ స్టాక్ సరఫరా, ప్రచార సామగ్రి ముద్రణ, ఎండీఏ డ్రగ్ ట్రాన్స్‌పోర్ట్‌లో అవకతవకలపై ఆరా తీశారు. వాటికి సంబంధించిన బిల్లులు, రికార్డులను పరిశీలించారు.

విజయ సంకేతం

- టీడీపీ మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య వైఎస్సార్ సీపీలో చేరిక
- భద్రయ్య కుమారుడు డాక్టర్ రాజేష్ రాకతో మరింత హుషారు
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో తండ్రీ కుమారుల చేరిక
- రాజాం వైఎస్సార్ సీపీలో కొత్త జోష్



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, కుమారుడు డాక్టర్ రాజేష్. చిత్రంలో ఎమ్మెల్యే జోగులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి,విజయనగరం: సార్వత్రిక ఎన్నికలకు మరో తొమ్మిదినెలలు గడువు ఉండగానే రాజకీయం వేడెక్కుతోంది. రాష్ట్రంలో ఈ దఫా ఎన్నికల్లో 175ను టార్గెట్ చేస్తూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారు. ఇటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో సహా స్థానిక ప్రజా ప్రతినిధులను కూడా ప్రజల్లో ఉంచుతూ సకాలంలో సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఆయన పాలనకు ఆకర్షితులై పలువురు రాజకీయ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు.

రాజాంలో కొత్త జోష్
రాజాం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఖాతాలో ఉంది. 2019 ఎన్నికల్లో ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన కోండ్రు మురళీమోహన్ భారీ ఓట్ల తేడాతో కంబాల జోగులు చేతిలో ఓడిపోయారు. రెండేళ్ల పాటు కోండ్రు నియోజకవర్గానికి ముఖంచాటేశారు. తాజాగా ఏడాదిన్నర కిందట నుంచి తిరుగుతున్న ఆయనకు రేగిడి, రాజాం, వంగర మండలాల్లో తమ పార్టీ ప్రధాన నేతల నుంచే వ్యతిరేకత ఉంది. ఈ నేపథ్యంలో రాజాంకు చెందిన టీడీపీ సీనియర్ నేత, రెండు పర్యాయాలు పాలకొండ టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన తలే భద్రయ్య, తన కుమారుడు డాక్టర్ రాజేష్ వైఎస్సార్ సీపీలో చేరారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వారి వెంట రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఉన్నారు. దీంతో రాజాం నియోజకవర్గం వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీలో చేరడం ఖాయమన్న విజయసంకేతం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

ఫాలోయింగ్ ఉన్న నేత
తలే భద్రయ్య 1985-89తో పాటు 1994-99 మధ్య కాలంలో పాలకొండ (అప్పట్లో ఎస్సీ) నియోజకవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందారు. 1999-2004 మధ్యకాలంలో ఏపీపీఎస్సీ మెంబర్‌గా కూడా సేవలందించారు. అనంతరం రాజాంలో స్థిరపడిన ఆయన నియోజకవర్గంలో అన్ని మండలాల్లోని టీడీపీ ప్రధాన నేతలతో పాటు ఇతర పార్టీ నేతలతో సన్నిహితంగా ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. రాజాం నియోజకవర్గంలో టీడీపీ అనగానే గుర్తుకొచ్చే నేత తలే భద్రయ్య. నియోజకవర్గాల విభజన అనంతరం 2009 నుంచి ఇప్పటివరకూ టీడీపీలోనే ఉంటూ తన వంతు పార్టీ గెలుపునకు కృషి చేసేవారు. అటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడుతో పాటు ఇటు స్థానిక టీడీపీ మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు వరకూ పార్టీ పెద్దలతో మంచి అనుబంధం, నియోజకవర్గ ప్రజలతో సత్సంబధాలు ఉన్నాయి. ఇప్పుడు అనూహ్యంగా టీడీపీ నుంచి ఆయన వైఎస్సార్ సీపీలో చేరడం నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

తండ్రి బాటలో తనయుడు
రాజాంలో ఎముకల వైద్యునిగా తలే భద్రయ్య కుమారుడు డాక్టర్ తలే రాజేష్‌కు పేరుంది. రాజాంలో జీఎంఆర్ కేర్ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్‌గా సేవలు అందించారు. ఆయన తన పదేళ్ల సర్వీసుల్లో పదివేలకు పైగా ఆపరేషన్లు చేసి రికార్డు సృష్టించారు. ఇటీవల సొంతంగా రాజాంలో సన్‌రైజ్ ఆస్పత్రిని ప్రారంభించారు. తలే రాజేష్‌ను టీడీపీ అధిష్టానం రాజాం నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో దించుతుందని ఊహించారు. రాజేష్ తీసుకున్న తాజా నిర్ణయంతో టీడీపీని ఆ కుటుంబం వ్యతిరేకిస్తున్నట్టు కార్యకర్తలకు అర్థమైంది. దీంతో టీడీపీ క్యాడర్ మొత్తం ఇప్పుడు డోలాయనంలో పడింది.

ముందే ఖాయమైన విజయం
తలే భద్రయ్యతో పాటు అతని కుటుంబం వైఎస్సార్‌సీపీలో చేరడంతో రాజాం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయం ఖాయమైందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. అమ్మవారికి తీపి పదార్థాలు నివేదించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి , ట్రస్టు బోర్డు మెంబర్లు పర్యవేక్షించారు.

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలపై అధ్యయనం



అధ్యయనం చేస్తున్న ట్రైనీ ఐఏఎస్‌లు

సీతంపేట: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలపై ట్రైనీ ఐఏఎస్‌ల బృందం సీతంపేట మండలంలోని పూతికవలసలో మంగళవారం అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా ఆ గ్రామ చరిత్ర, పుట్టుపూర్వోత్తరాలు, గిరిజనులు ఏ విధంగా పండగలు చేస్తారు? వివిధ రకాల పండగల్లో ఎటువంటి సంప్రదాయ దుస్తులు ధరిస్తారు తదితర అంశాలు వివరంగా తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి వాకబు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ఏవిధంగా ఉపయోగపడుతున్నాయో ప్రశ్నించారు. బీపీఎల్ కేటగిరిలో ఎంతమంది ఉన్నారనేది పరిశీలించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



చెరువులో పడి మృతిచెందిన శ్రీనివాస్

జామి: మండలంలోని అలమండ గ్రామానికి చెందిన సిరికి శ్రీనివాస్(55) చెరువులో పడి మృతిచెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాస్ ప్రతిరోజు సాయంత్రం కళ్లానికి వెళ్లి పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుంటాడు. రోజూలాగానే సోమవారం రాత్రి కళ్లానికి వెళ్లిన ఆయన తిరిగి ఎంతోసేపటికి ఇంటికి రాలేదు. మంగళవారం ఉదయం గ్రామం సమీపంలో ఉన్న అయ్యచెరువులో శ్రీనివాస్ మృతదేహం తేలిఉండడంతో గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం మేరకు పోలీసులు వచ్చి చెరువులో నుంచి శ్రీనివాస్ మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. బహిర్భూమికి వెళ్లి చెరువులో పడి ఈతరాకపోవడంతో మృతిచెందాడని మృతుడి కుమారుడు పోలీసులకు ఫిర్యాదుచేయగా కేసునమోదు చేసినట్లు ఏఎస్సై ఆర్.నర్సింగరావు తెలిపారు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు సాయి, ఉన్నారు.

లారీ ఢీకొని మరో వ్యక్తి..

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి–గర్భాం ప్రధాన రహదారిలో ఫేకర్ కొబ్బరితోట వద్ద జరిగిన ప్రమాదంలో మెరకముడిదాం మండలం సింగవరం గ్రామానికి చెందిన మంగి వెంకటరమణ(53) దుర్మరణం చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని కుమార్తె మంగి గాయత్రి ఫిర్యాదు మేరకు పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మెరకముడిదాం మండలం ఇప్పలవలస గ్రామంలో జరిగే తన మేనమామ వివాహానికి హాజరయ్యేందుకు భీమిలిలో డిప్లమో చేస్తున్న మృతుడి కుమార్తె గాయత్రి విజయనగరం వరకు బస్సు ప్రయాణం చేసింది. విజయనగరం నుంచి తండ్రి వెంకటరమణతో కలిసి బైక్‌పై మెరకముడిదాం మండలం ఇప్పలవలస గ్రామానికి వెళ్తుండగా గరివిడి దాటిన తరువాత గరివిడి–గర్భాం ప్రధాన రహదారిలో ఫేకర్ కొబ్బరితోట వద్దకు వచ్చే సరికి ఎదురుగా గర్భాం నుంచి వస్తున్న లారీ వారి బైక్‌ను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో తండ్రీ,తుళ్లు బైక్‌పై నుంచి కింద పడిపోగా వెంకటరమణ తలపై నుంచి లారీ వెళ్లిపోవడంతో సంఘటన స్థలంలో మృతిచెందాడు. గాయత్రికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెర్ప్ ఉద్యోగులకు సంబరం

- భారీగా వేతనాలు పెంచిన ప్రభుత్వం
- ఈ నెల నుంచి బేసిక్ మీద 23 శాతం అధికం
- వచ్చే నెల నుంచి ఉద్యోగుల ఖాతాల్లోకి
- జిల్లాలో 187 మందికి లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలు నాయుడిని సత్కరిస్తున్న సెర్ప్ ఉద్యోగులు

విజయనగరం అర్బన్: జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో పనిచేసే గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా జీతాలు పెంచింది. సెర్ప్ పరిధిలో వైఎస్సార్ క్రాంతి పథంలో పనిచేసే ఈ ఉద్యోగులు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)ల ఉన్నతికి విశేషంగా కృషి చేస్తున్నారు. అయితే పనికి తగిన జీతం రావడం లేదని వీరు కొన్నేళ్లుగా ప్రభుత్వాలను కోరుతూ వచ్చారు. రాష్ట్రంలో వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం వీరి జీతాలు పెంచుతూ ఈ నెలలో జీవో 64ను విడుదల చేసింది. బేసిక్ జీతంపై ఏకంగా 23 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పెరిగిన ఈ జీతం ఆగస్టు ఒకటి నుంచి వర్తింప చేస్తున్నట్లు ప్రభుత్వం జీవోలో స్పష్టంగా పేర్కొంది. దీంతో సెప్టెంబర్‌లో వచ్చే జీతం పెరుగుతుండడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా డీఆర్‌డీఏ–వెలుగు క్రాంతిపథంలోని ఎస్‌హెచ్‌జీ గ్రూపుల అభివృద్ధిలో సెర్ప్ పరిధిలో పనిచేసే ఉద్యోగులు కీలకంగా ఉన్నారు. వారిలో డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం), అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఏపీఎం), కమ్యూనిటీ కో ఆర్డినేటర్ (సీసీ)లు, అడ్మిన్ అసిస్టెంట్లు (ఏఏ) ఉన్నారు. వీరిలో చాలా మంది 2002 నుంచి పనిచేస్తున్నారు. ఎస్‌హెచ్‌జీల అభ్యున్నతికి వీరు కృషి చేస్తున్నారు. వాణిజ్య బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడంతో పాటు వాయిదాలు కట్టించడం, స్త్రీనిధి బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వడం, ఆయా ఎస్‌హెచ్‌జీ గ్రూపులు చేసే వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. ప్రభుత్వ పథకాలైన జగనన్నతోడు, వైఎస్‌ఆర్ చేయూత, వైఎస్‌ఆర్ ఆసరా, వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ, జగనన్న పాలవెల్లువ, ఉన్నతి వంటి పథకాలను మహిళల వద్దకు తీసుకు వెళ్లి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నారు. వారి వ్యాపారాలకు మార్కెటింగ్ అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉండే విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీఓఏ యానిమేటర్ల)ను సమన్వయం చేసుకుని సంఘాల ఉన్నతికి కృషి చేస్తున్నారు. వీరు కొన్నేళ్లుగా తమ జీతాలు పెంచాలని కోరుతున్నారు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి వీరి వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో జిల్లాలో ప్రాజెక్టు మేనేజర్ (డీఎంపీ)– 1కి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు 11 మందికి, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం)లు 50 మందికి, క్లస్టర్ కో ఆర్డినేటర్లు (సీసీ) 103 మందికి, అడ్మిన్ అసిస్టెంట్లు (ఏఏ) 22 మందికి చొప్పున మొత్తం 187 మందికి జీతాలు పెరిగాయి. వీరిలో చాలా మంది 2000వ సంవత్సరం నుంచి స్వయం సహాయక సంఘాల అభ్యున్నతికి బ్యాంకుల నుంచి స్త్రీ నిధి, ఉన్నత వివిధ రకాల జీవనోపాధులను పెంపొందిస్తూ ప్రస్తుతం ప్రభుత్వ పథకాలపై వైఎస్సార్ చేయూత, వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక, జగనన్న తోడు, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, ఉన్నతి వంటి పథకాలను మహిళల వద్దకు తీసుకు వెళ్లి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. ప్రాజెక్ట్ మేనేజర్‌కు బేసిక్ జీతం మీద రూ.4 వేల నుంచి రూ.12 వేల వరకూ పెరిగింది.

ఉద్యోగుల ఆనందోత్సవాలు

వేతన పెంపును ప్రభుత్వం ప్రకటించిన తరువాత క్షేత్రస్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకు సెర్ప్ ఉద్యోగులు ఆనందోత్సవాలు జరుపుకున్నారు. ఏళ్లతరబడి ఉద్యమాలు చేసినా ఏ ప్రభుత్వం స్పందించలేదు. పాదయాత్రలో హామీ ఇవ్వపోయినా సమస్య తెలుసుకుని వేతనాలను భారీగా పెంచినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు చెబుతూ పలు ప్రదర్శనలు చేపట్టారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుని, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రసామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును కలిసి జిల్లా సెర్ప్ ఉద్యోగులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు.

సిబ్బంది కుటుంబాల్లో వెలుగులు



వేతనాలు పెంచకపోవడం వల్ల కొన్నేళ్లుగా ఇబ్బంది పడ్డాం. గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వాన్ని డిమాండ్ చేయకపోయినా మా విధుల ప్రాధాన్యతను గుర్తించి మాకు 23 శాతం జీతం పెంచడం చాలా ఆనందంగా ఉంది. దీనివల్ల కుటుంబ పోషణకు ఇబ్బంది ఉండదు. ఆర్థికంగా నిలదొక్కుకుంటాం. ఉత్సాహంగా పనిచేయడానికి ఇదొక అవకాశం, ప్రభుత్వ పథకాలను ప్రతి లబ్ధిదారుడికీ చేర్చేందుకు మరింత కృషి చేస్తాం. సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

– ఎన్.ఆదయ్య,
డీపీఎం, ఏరియా కో–ఆర్డినేటర్, ఎస్‌కోట

సీఎంకు రుణపడి ఉంటాం



సెర్ప్ పరిధిలో వైఎస్‌ఆర్ క్రాంతి పథంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఏకంగా బేసిక్ మీద 23 శాతం జీతం పెంచడం హర్షణీయం. సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం చాలా సంతోషాన్ని ఇచ్చింది. అన్ని కేటగిరి ఉద్యోగులకు వేతనాలు పెంచడం సంతోషదాయకం. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– రొంగలి శ్రీనివాసరావు,
ఏపీఎం, వేపాడ మండలం

‘ప్రత్యేక’ పిల్లల జిల్లా క్రీడా పోటీల ప్రారంభం



జెండా ఊపి క్రీడలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు డిస్ట్రిక్‌లెవెల్ ఆటల పోటీలు పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఈ పోటీలకు ప్రత్యేక అతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మన్యం జిల్లాలో గల 15 మండలాల నుంచి 120 మందిప్రత్యేక అవసరాలు గల పిల్లలు వారికి సపోర్టుగా తల్లులు, ఐఆర్పీ ఉపాధ్యాయులు, ఐడీఎస్ఎస్ ఉపాధ్యాయులు పాలకొండ డిప్యూటీ డీఈఓ విజయకుమారి, పార్వతీపురం మండల ఎంఈఓ 1 విమల కుమారి, పార్వతీపురం మన్యం జిల్లా సహిత విద్య సమన్వయకర్త పి భానుమూర్తి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ జిల్లా పరిధిలో గల 15 మండలాల్లో ఉన్న భవిత కేంద్రాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు జాతీయ క్రీడా దినోత్సవం రోజున జిల్లా స్థాయి క్రీడలను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న కోఆర్డినేటర్, సిబ్బంది, అధికారులకు అభినందనలు తెలిపారు. ప్రత్యేక అవసరాలు కగల పిల్లలు మానసిక శారీరక ఉల్లాసాన్ని పెంపొందించేందుకుగాను ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రత్యేక అవసరాలు గలిగిన పిల్లలను గుర్తించేందుకు ఈమధ్య ఎస్సీఈఆర్టీ ప్రత్యేకమైన ప్రశస్త యాప్ రూపొందించిందని చెప్పారు. ఈ యాప్ ద్వారా పిల్లల్లో ఉన్న 21 రకాల వైకల్యాల్ని చాలా సులువుగా గుర్తించవచ్చన్నారు. చివరగా విజేతలకు డీఇఓ ఎస్. ప్రేమ్‌కుమార్ మెడల్స్, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

ఎఫ్‌పీఓలకు అన్ని రకాలుగా సహకారం

- కలెక్టర్ నాగలక్ష్మి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఎఫ్‌పీఓల ద్వారా రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి వ్యవసాయాన్ని లాభదాయకంగా చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం నాబార్డ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారు కంపెనీలకు కావలసిన ఇన్‌పుట్ లైసెన్స్‌లను త్వరితగతిన జారీ చేయాలని సూచించారు. నాబార్డ్ ఆర్థిక సహకారంతో జిల్లాలో 28 రైతు ఉత్పత్తి కంపెనీలు ఏర్పాటయ్యాయని, వాటిలో ఎక్కువగా సేంద్రీయ ఉత్పత్తులు, చిరు ధాన్యాలు, కూరగాయలు, మామిడి, చెరకు తదితర ఉత్పత్తులపై పని చేస్తున్నాయని నాబార్డ్ డీడీఎం నాగార్జున కలెక్టర్‌కు తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసేందుకు అవసరమైన కలెక్షన్ కేంద్రాలు, స్టోరేజ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. ఎఫ్‌పీఓల నిర్వహణలో ప్రమాణాలను పాటించాలని, ఎక్కువ మంది రైతులను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ సూచించారు. ఎఫ్‌పీఓలకు అన్ని వ్యవసాయ, అనుబంధ శాఖలు సహకరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వరుణ్ మారుతీతో ఐటీఐ ఒప్పందం



ఒప్పందపత్రాన్ని అందజేస్తున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐకి వరుణ్ మారుతితో డీజిల్ మెకానిక్ ట్రైనీల శిక్షణకు సంబంధించిన ఒప్పందం కుదిరింది. ఈ మేరకు మంగళవారం జేసీ మయూర్ అశోక్ సమక్షంలో ఈ ఒప్పందం చేసుకున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీగిరి తెలిపారు. కార్యక్రమంలో వరుణ్ గ్రూప్ జనరల్ మేనేజర్ (సర్వీసెస్) శ్రీనివాస్ రెడ్డి, ట్రైనింగ్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, జిల్లా మేనేజర్ కిరణ్, ట్రైనింగ్ ఆఫీసర్ రామాచారి పాల్గొన్నారు. ఈ ఒప్పందం వల్ల శిక్షణ కాలంలో ఉన్నప్పుడే ఐటీఐ డీజిల్ మెకానిక్ విద్యార్థులకు 3 నెలల కాలం వరుణ్‌లో ప్రత్యేక శిక్షణ పొందే అవకాశం కలుగుతుంది. వరుణ్ నుంచి కూడా ట్రైనర్స్ వచ్చి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు, ప్రాక్టికల్స్ కోసం ఎక్విప్‌మెంట్ సపోర్ట్ కూడా కలుగుతుందని తెలిపారు.

ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: ప్రస్తుత ఖరీఫ్‌లో ధాన్యం సేకరణకు సిద్ధం కావాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో మంగళవారం జరిగింది. ధాన్యం సేకరణకు అక్టోబరు నెలాఖరు నాటికి 25 లక్షల గోనె బస్తాలను ముందస్తుగా సిద్ధం చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని, సిబ్బంది నియామకం పూర్తి చేయాలని ఆదేశించారు. యాప్‌ల వినియోగంలో సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని హితవు పలికారు. కూలీలు, రవాణాకు కార్యాచరణ ప్రణాళిక ఉండాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట రావు, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, జిల్లా సహకార అధికారి సన్యాసి నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జె.ఎల్.ఎస్ మూర్తి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం. శశి కుమార్, జీసీసీ డివిజనల్ మేనేజర్లు వి. మహేంద్ర, సంధ్య, జిల్లా సరఫరా అధికారి శివ ప్రసాద్, జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి ఎల్.అశోక్ కుమార్, మిల్లర్లు, రవాణా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిగరెట్ల అక్రమ వ్యాపారులపై దాడులు



స్వాధీనం చేసుకున్న సిగరెట్ బాక్సులతో అధికారులు

బొబ్బిలి: పట్టణంలో సిగరెట్ల అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం, ఇతర అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన హెచ్–10,గుడ్ టైమ్స్ సిగరెట్ ప్యాకెట్లను అనుమతులు లేకుండా స్థానికంగా హోల్‌సేల్‌గా విక్రయిస్తున్న మేదరిబందకు చెందిన గెంబలి వెంకటరమణ నుంచి రూ.41వేల విలువైన 1633 ప్యాకెట్లను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.ప్రజారోగ్యానికి హాని కలిగించే అన్‌బ్రాండెడ్, బ్యాన్డ్ సిగరెట్లను నిందిత వ్యాపారి కలిగి ఉన్నట్టు ధ్రువీకరించామని అధికారులు తెలిపారు. ఏఎస్సై బీవీ రమణ, రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ సిబ్బంది తదితరులు దాడుల్లో పాల్గొనగా ఎస్సై చదలవాడ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కులదూషణపై కేసు నమోదు

రాజాం సిటీ: రాజాం ఫిషరీస్ సొసైటీ అధ్యక్షుడు బెహరా తవుడు తనను కులం పేరుతో దూషించడమే కాకుండా దుర్భాషలాడుతున్నాడని గడిముడిదాం గ్రామానికి చెందిన సూరపాటి సురేష్ ఫిర్యాదు చేశాడని సీఐ కె.రవికుమార్ మంగళవారం తెలిపారు. సొసైటీలో తన సభ్యత్వం తొలగిస్తానని అవమానించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

స్కూల్‌గేమ్స్‌లో ప్రథమస్థానంలో మోడల్‌స్కూల్



విద్యార్థినులను అభినందిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

సాలూరు: స్కూల్‌గేమ్స్‌లో పార్వతీపురం మన్యం జిల్లాస్థాయిలో సాలూరు మండలంలోని పురోహితునివలస మోడల్‌స్కూల్ ప్రథమ స్థానంలో నిలిచింది.జాతీయక్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా ప్రతిభ అవార్డ్స్‌లో మోడల్‌స్కూల్ విద్యార్థినలు ప్రతిభ కనబర్చి ప్రథమస్థానం కైవసం చేసుకున్నారు.ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు జేసీ గోవిందరావు, డీఈఓ ప్రేమ్‌కుమార్‌లు అవార్డులు అందించినట్లు పాఠశాల పీడీ రవి మంగళవారం తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి గోపాలపురం , మండల పరిధి బొద్దాం సమీపంలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. గోపాలపురం గ్రామానికి చెందిన కోరాడ రాములు ఈ నెల 28న బొబ్బిలి రోడ్డులోని నవ్యనగర్ వద్ద ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొనడంతో గాయపడగా స్థానికుల సహాయంతో రాజాం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అలాగే గరివిడి మండలం గొట్టుంది గ్రామానికి చెందిన లోపింటి రాంబాబు మోటార్ సైకిల్ పై రాజాం వస్తుండగా జీసీహెచ్ పల్లి జెండాల దిబ్బ సమీపంలో రాజాం నుంచి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై ఎస్.భాస్కర రావు తెలిపారు.

ఓటరు తొలగింపు వివరాలు పరిశీలించాలి

పార్వతీపురంటౌన్: ఓటరు తొలగింపుల వివరాలు పరిశీలించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి, పార్వతీపురం నియోజక వర్గం ఓటరు నమోదు అధికారి కె.హేమలత రాజకీయ పార్టీలను కోరారు. ఓటరు పునశ్చరణ కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి వివరించారు. శాశ్వత వలసలు, మృతి చెందిన వారు, డూప్లికేట్ ఎంట్రీలు గల ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తున్నామని, తొలగించిన వాటిని పరిశీలించి వాటిలో లోపాలు ఉన్నా, లేదా ఇతర అంశాలు ఉంటే తెలియజేయాలని కోరారు. తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేసేందుకు కృషి చేస్తున్నామని, అందుకు రాజకీయ పార్టీలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందాలి

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



మూమెంట్ ఆర్డర్స్ అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం 20 మంది ఎంపీహెచ్ఎస్(ఫిమేల్) సూపర్‌వైజర్స్‌కు మూమెంట్ ఆర్డర్స్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటాయించిన ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా వ్యాధులు ప్రబలితే అక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎపిడిమాలజిస్టు డాక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనకు యువజన ఉత్సవాలు

హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణశాఖ ఆధ్వర్యంలో యువజన ఉత్సవాలను నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం వాల్ పోస్టర్లను ఆయన కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ, డీపీఎం బాలాజీ, డీఐసీ సాక్షి గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి పుస్తెలతాడు తెంపివేత

సీతానగరం: మండలంలోని ఆర్ వెంకంపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు పెంట ఆదిలక్ష్మి మెడలో పుస్తెల తాడును సోమవారం ఇద్దరు వ్యక్తులు తెంచి పారిపోయారు. వివరాలిలా ఉన్నాయి. ఉదయం పొలానికి వెళ్తున్న ఆమెను ఇద్దరు వ్యక్తులు వెంబడించి అడ్డగించి మద్యం సీసాలతో తలపై కొట్టి మెడలో ఉన్న పుస్తెల తాడును లాక్కుని పరారైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదిలక్ష్మి కుటుంబసభ్యులు పొలం పనులకు ముందు వెళ్తుండగా కొంత వ్యవధిలో బయల్దేరిన ఆమె దూరంగా నడుస్తోంది. ఆమె గ్రామంలో బయల్దేరినప్పటినుంచి గమనిస్తున్న ఇద్దరు దుండగులు వెంబడించి మార్గమధ్యంలో ఆమెపై దాడి చేసి మెడలోఉన్న సుమారు 2.5 తులాల పుస్తెల తాడును లాక్కున్నారు. ఈ ఘటనపై ఎస్సై కె.నీలకంఠం వద్ద ప్రస్తావించగా బాధితుల ఫిర్యాదు చేసిన మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మంగళవారం తెలియజేశారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹138	₹246	₹ 256